


APTEL/2015/65279

Postal Reg.No. MPM/L.22/VNEWS/25-27

# V న్యూస్

మన ఊరు - మన వార్తలు

తెలుగు దినపత్రిక

e-mail : vnewsmachilipatnam@gmail.com
e-mail : vnewsindia@gmail.com





సంపుటి :11 సంచిక : 322 మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ, ఏలూరు, గుంటూరు, తెలంగాణ, వైఎస్ఆర్ కడప, ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు 12-06-2026 శుక్రవారం పేజీలు :8 వెల : రూ.3/-










# మోదీ రూపకల్పన చేసిన వికసిత భారత్ వినూత్నం : చంద్రబాబు

**విజయవాడ :** ప్రధాని మోదీ రూపకల్పన చేసిన వికసిత్ భారత్ 2047కు ఏపీ కూడా స్వర్ణాంధ్ర విజన్‌ను అనుసంధానం చేశా మని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసించారు .లినీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులిప్రసంగించారు.

వికసిత్ భారత్‌తో పాటు స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను తన ప్రసంగంలో ముఖ్యమంత్రిలిఆవిష్కరించారు. ప్రధానమంత్రిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి సమావేశంలో ముందుగా అభినందనలు తెలిపారు..

పాలసీ పెరాలసిస్ నుంచి గత దశాబ్ద కాలంగా భారత్ పాలసీ గ్రోత్ వైపుగా అడుగులు వేసింది. మోదీ హయాంలో డిజిటల్ ఇండియా, జన్ ధన్, ఆధార్, యూపీఐ, మేక్ ఇన్ ఇండియా లాంటి కార్యక్రమాలు వచ్చాయి. సరళీకరణ, పాలనా సంస్కరణలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లు భారతదేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితి పరిస్థితులు ఉన్నా భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ అవతరించింది. ప్రధాని మోదీ రూపకల్పన చేసిన వికసిత్ భారత్ 2047కు ఏపీ కూడా స్వర్ణాంధ్ర విజన్‌ను అనుసంధానం చేశాం. అభివృద్ధికి మానవ వనరులే పునాదిగా స్వర్ణాంధ్ర ఏ2047 విజన్ రూపకల్పన జరిగింది. పేదరిక నిర్మూలన, నైపుణ్యం, ఉపాధి, నీటి- ఇంధన భద్రత, అగ్రి-టెక్, గ్లోబల్ లాజిస్టిక్స్, డీప్-టెక్ లాంటి 10 సూత్రాలను భాగం చేశాం. ఈ లక్ష్యాలను చేరుకునేందుకు సాంకేతికత, పారదర్శక డేటా డ్రివెన్ పాలనా వ్యవస్థను ఏర్పాటు చేశాం. ఆర్టీజీఎస్ ద్వారా కీ పెర్ఫార్మెన్సు ఇండికేటర్లను పర్యవేక్షిస్తున్నాం. వాతావరణం, పంటల స్థితిగతులు, భూగర్భ జలాల వంటి 41 రకాల సమాచారాన్ని రియల్ టైమ్ లో విశ్లేషించి ప్రజలకు సమాచారం ఇస్తున్నాం. మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ యాప్ ద్వారా ప్రభుత్వ సేవల్ని పారదర్శకంగా ప్రజల ఇంటివద్దనే అందిస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో గడచిన 2 ఏళ్లలో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామన్నారు. పెట్టుబడుల్ని ఆకర్షించటంలో రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని అదే సమయంలో అస్థిరమైన విధానాలు మేలు చేయవు. అత్యుత్తమ స్థాయి మౌలిక సదుపాయాలు, వేగంగా అనుమతుల జారీ లాంటి స్థిరమైన వాతావరణం కల్పనపై దృష్టి పెట్టాలి. గృహ నిర్మాణం, పారిశుద్ధ్యం, కుళాయి నీరు, వంటగ్యాస్, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ, డీబీటీ లాంటి ప్రజలకు అందించాలన్నదే తమ లక్ష్యం. పీ4 లాంటి కార్యక్రమం ద్వారా సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం. ప్రజల వైద్యారోగ్య పరిరక్షణకు సంజీవని అనే వినూత్న కార్యక్రమం



ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నాం

ఆయుష్మాన్ భారత్‌తో అనుసంధానించటం ద్వారా ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య రక్షణ అందించటమే లక్ష్యం. యోగా, మెడిటేషన్ లాంటి ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రజల్లోకి తీసుకెళ్లేలా మానవ వనరుల అభివృద్ధిపై దృష్టిపెట్టామన్నారు. విద్యారంగంలో ప్రాథమిక అభ్యాసం నుంచి ఉన్నత విద్య వరకూ సమూల సంస్కరణలు చేపట్టాం. గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంతో పాటు ఏఐ ఆధారిత అడాప్టివ్ లెర్నింగ్ వ్యవస్థలతో ఫలితాలను మెరుగు పరుస్తున్నాం. వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ మోడల్ విద్యార్థులు చదువుకుంటూనే నైపుణ్యాలు పొందుతున్నారు. నైపుణ్యం వెబ్ పోర్టల్, పీఎం సేతు ద్వారా ఏఐ, క్వాంటం టెక్నాలజీస్ లాంటి రంగాల్లో యువతను సిద్ధం చేస్తున్నాం. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5 కంటే తక్కువకు పడిపోవడం వల్ల పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. భవిష్యత్తులో ఆర్థిక, మానవ వనరుల కొరత ఏర్పడకుండా ఏపీలో పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ రూపొందిస్తున్నాం. దీనిపై జాతీయ స్థాయిలో కార్యాచరణ అవసరమన్నారు. వికసిత్ భారత్ 2047 రూపకల్పనలో కేంద్ర రాష్ట్రాల మధ్య నిరంతర భాగస్వామ్యం అవసరం. ఈ లక్ష్య సాధనకు నీతి ఆయోగ్ తో కలిసి పనిచేసేందుకు ఏపీ సిద్ధంగా ఉ ంటుందనీ వివరించారు.

# ఇరాన్‌పై అమెరికా సైన్యం మళ్లీ భీకర దాడులు : ట్రంప్ ప్రతీకారం

**అమెరికా :** ఇరాన్‌పై భారీస్థాయిలో దాడులు చేస్తామని ట్రంప్ చెప్పిన కొద్దిసేపట్లోనే ఆ హెచ్చరికలు వాస్తవ రూపం దాల్చాయి. దీంతో పశ్చిమాసియాలో యుద్ధపు మంటలు తీవ్రమయ్యాయి. ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఇవి ట్రంప్ ఆదేశాల మేరకు కేవలం ఆత్మరక్షణ కోసం చేశామని పేర్కొంది. ఇరాన్‌లోని దక్షిణ ప్రాంతంలో భారీగా పేలుళ్లు జరిగాయి. మినాబ్, బందర్ అబ్బాస్, సిరిక్, టెహ్రాన్ ప్రాంతాలపై అమెరికా దృష్టిసారించింది. మరోవైపు కాల్పుల విరమణ కోసం ఇరాన్ ప్రతినిధులు ప్రాధేయపడ్డారని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనిని ఇరాన్ కొట్టిపారేసింది. ఈవిడతలో దాడులు ముగిసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అమెరికా ప్రతిపాదిత ఒప్పందంపై ఇరాన్ సంతకం చేయకపోతే రేపు రాత్రి దాడులు చేస్తామని అధ్యక్షుడు ట్రంప్ చెప్పినట్లు ఆ దేశ జాతీయ మీడియా సంస్థ పేర్కొంది. దీనికితగినట్లే ఇరాన్‌లోని స్థావరాలను లక్ష్యంగా చేసుకొంది. మొత్తం 49 తోమహాక్ క్షిపణలను ఈ దాడుల్లో వినియోగించినట్లు పేర్కొంది. ఇరాన్‌కు 64 కిలోమీటర్ల దూరంలోని కొన్ని లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు తెలిపింది. దీంతోపాటు ఫైటర్ జెట్లు కూడా దాడుల్లో పాల్గొని పర్షియన్ గల్ఫ్ వద్ద ఇరాన్ రాడార్, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను దెబ్బతీసినట్లు వెల్లడించింది.

**హర్మూజ్ మూసివేత.. బహ్రెయిన్, కువైట్‌పై ప్రతిదాడులు**

అమెరికా దాడులకు ఇరాన్ దీటుగా స్పందించింది. హర్మూజ్ జలసంధిని అన్నిరకాల నౌకలకు మూసివేసినట్లు ప్రకటించింది. రెండు చమురు ట్యాంకర్లపై కూడా ఐఆర్‌జీసీ దళాలు దాడులు చేశాయి. వాటికి అమెరికా యుద్ధనౌకలు సాయపడుతున్నట్లు ఆరోపించాయి. మరోవైపు కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలను ఇరాన్ టార్గెట్ చేసింది. బహ్రెయిన్‌లోని షేక్ ఇసా ఎయిర్‌బేస్, కువైట్‌లోని అలీఅల్‌సలీమ్ ఎయిర్‌బేస్‌లపై డ్రోన్లు దాడి చేసినట్లు ఐఆర్‌జీసీ పేర్కొంది

# డీఎస్సీ-2025లో సీబీఐ దర్యాప్తు జరపాలి : వైయస్ జగన్ డిమాండ్

**విజయవాడ :** ప్రశ్నించడాన్ని అణిచివేయాలని చూస్తే.. కాక్రోచ్ (బొద్దింక)లు లేస్తాయని వైఎస్ జగన్ తీవ్ర హెచ్చరికలు చేశారు. ఏపీలో తాము కూడా కాక్రోచ్‌లమేనని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో ప్రశ్నిస్తుంటే.. అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని గుర్తు చేశారు. ఇలా చేసుకుంటూ పోతే.. పోరాటాలు తప్పవని చంద్రబాబు సర్కార్‌కు వైఎస్ జగన్ వార్నింగ్ ఇచ్చారు. డీఎస్సీ అభ్యర్థుల తరఫున న్యాయపోరాటం చేస్తామన్న జగన్.. వారికి న్యాయం జరగకపోతే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కమిషన్ వేస్తామని తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తి చూపిస్తుంటే.. తట్టుకోలేకపోతున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై.. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబు పాలనలో చాలాసార్లు పేపర్లు లీక్ అయ్యాయని గుర్తు చేశారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన సంఘటనలను జగన్ వివరించారు.

ఈ క్రమంలోనే ప్రభుత్వ అసమర్థతపై తాము ప్రశ్నిస్తుంటే.. ప్రతీ ఒక్కరిపై కేసులు పెడుతున్నారని.. అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. ఇలా ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తే.. కాక్రోచ్‌లు పుట్టుకొస్తాయని హెచ్చరికలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఏపీలో వైసీపీనే కాక్రోచ్‌లు అంటూ జగన్ వ్యాఖ్యానించడం గమనార్హం.కూటమి సర్కార్ చేసిన తప్పులను తాము ప్రశ్నిస్తుంటే.. చంద్రబాబుకు నరాలు తెగిపోయే అంత బీపీ వస్తోందని వైఎస్ జగన్ ఎద్దేవా చేశారు. అందుకే ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి, వారిని అరెస్టులు చేసి భయపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఒకటి గుర్తుపెట్టుకోవాలని.. ఇది జెన్‌జీ కాలమని.. ఇప్పుడు జెన్ ఆల్ఫా కూడా నడుస్తోందని పేర్కొన్న వైఎస్ జగన్.. దేన్నీ ఆపలేరని గుర్తు చేశారు. మీరు ఆపాలని ప్రయత్నిస్తే.. ఇంతింతై వటుడింతై పెరుగుతుందని హెచ్చరించారు. దగాపడిన యువత కూటమి ప్రభుత్వాన్ని



విడిచిపెట్టదని, తగిన గుణపాఠం తప్పకుండా చెప్తారని తేల్చి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా కాక్రోచ్‌లు బయటికి వస్తాయి జాగ్రత్త అంటూ వార్నింగ్ ఇచ్చారు.ఇక చంద్రబాబు పాలన మొత్తం లీకుల మయమేనని వైఎస్ జగన్ ఆరోపించారు. ప్రస్తుతం డీఎస్సీ విషయంలోనూ అదే జరిగిందని పేర్కొన్నారు. 1995లో టెన్త్ క్లాస్ పేపర్ల లీక్.. 1996లో ఎంసెట్ ఇంజినీరింగ్ పేపర్స్ లీక్.. 1997లో ఇంటర్మీడియట్ పేపర్స్ లీక్.. 2017 టెన్త్ సైన్స్ పేపర్ లీక్.. 2019లో టెన్త్ పేపర్ లీక్.. 2025లో బీఈడీ పేపర్ లీక్.. 2025లో టెన్త్ మ్యాథ్స్ పేపర్ లీక్.. ఇప్పుడు డీఎస్సీ టీచర్ల రిక్రూట్‌మెంట్ పేపర్ లీక్ అంటూ ఎద్దేవా చేశారు. పేపర్ లీకుల్లో ఇది చంద్రబాబు రికార్డు అంటూ వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

డీఎస్సీపై తమ వద్ద ఆధారాలు ఉన్నాయని.. అందుకే దీనిపై తాము సీబీఐ దర్యాప్తు కోసం పట్టుబడుతున్నట్లు వైఎస్ జగన్ తెలిపారు. ఈ కేసులో లోతుగా విచారణ చేస్తే.. మరిన్ని విషయాలు తప్పకుండా బయటికి వస్తాయని తేల్చి చెప్పారు. ఏపీ విద్యాశాఖ మంత్రిగా స్వయానా సీఎం చంద్రబాబు కుమారుడు నారా లోకేష్ ఉన్నారు కాబట్టి.. ఈ తప్పులపై విచారణ చేయడానికి చంద్రబాబు ముందుకు రారని ఆరోపించారు. పైగా ఎదురుదాడి చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.డీఎస్సీ అభ్యర్థులు అంతా వారం రోజుల క్రితం తన వద్దకు వచ్చారని గుర్తు చేసిన వైఎస్ జగన్.. వారి తరఫున న్యాయపోరాటం చేస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఒకవేళ అప్పటికీ న్యాయం జరగకపోతే.. వైసీపీ తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక కమిషన్ ఏర్పాటు చేసి.. రీ వెరిఫై చేసి, అన్యాయం జరిగిన వారికి తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తప్పు చేసిన వారిని శిక్షిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# రాజ్యసభ ఎంపీలుగా టీడీపీ, జనసేన అభ్యర్థులు ఏకగ్రీవం..

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు టీడీపీ, జనసేన నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు పూర్తి కావడం, నాలుగు స్థానాలకు నలుగురు అభ్యర్థులే పోటీలో నిలవడంతో వారి ఎన్నిక ఏకగ్రీవమైంది. టీటీపీ నుంచి సానా సతీశ్, బాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ పోటీలో నిలవగా.. జనసేన నుంచి లింగమనేని రమేశ్ నామినేషన్ వేశారు. అయితే, పోటీలో నలుగురు అభ్యర్థులే ఉండడంతో వారి ఎన్నిక ఖరారైంది.ఆంధ్రప్రదేశ్ సహా 10 రాష్ట్రాల్లోని రాజ్యసభ స్థానాలకు జూన్ 1న భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. దీని



ప్రకారం జూన్ 18న మట్నత్తం 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ తెలిపింది. జూన్, జులైలో 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. అలాగే పదవీకాలం ముగియకుండానే ఖాళీ అయిన మరో మూడు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ మేరకు జూన్ 1 నుంచి 8వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఈసీ తెలిపింది. ఈనెల 9న నామినేషన్ల పరిశీలన.. 11వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చింది. జూన్ 20 నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఈసీ వెల్లడించింది.

## 'ఫిఫా'కు అమెరికా గండం!

మరికొన్ని గంటల్లో ప్రపంచవ్యాప్త సాకర్ అభిమానులను 39 రోజులపాటు ఊగించి, శాసించే క్రీడా సంరంభం మొదలుకాబోతోంది. అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య(ఫిఫా) నేతృత్వంలో గురువారం అర్ధరాత్రి 12.30 దాటాక (భారత కాలమానం ప్రకారం చెప్పాలంటే శుక్రవారం) ప్రపంచ ప్రసిద్ధ మెక్సికో సిటీ స్టేడియం(ఎస్టాడియో అజకా) వేదికగా మెక్సికో--దక్షిణాఫ్రికా జట్ల మధ్య సాగే తొలి పోరుతో ఈ జాతరకు అంకురార్పణ జరుగుతుంది. 96 యేళ్ల వరల్డ్ కప్ చరిత్రలో ఇలా మూడు దేశాల్లో ఈవెంట్లు నిర్వహించటం ఇదే తొలిసారి. అమెరికా, కెనడా, మెక్సికో 'ఐక్యంగా, ఒక్కటిగా' నినాదంతో కలిసికట్టుగా బిడ్ వేసి గెల్చుకున్నాయి. ఈసారి జట్ల సంఖ్య 32 నుంచి 48కి పెరగటంతో 104 మ్యాచ్‌లు జరుపుతున్నారు. వీటన్నిటినీ ఈ మూడు దేశాల్లోని 16 నగరాల్లో నిర్వహించనుండగా, ఇందులో 78 మ్యాచ్‌లు, కీలక ఈవెంట్లు తమ దగ్గరే ఉండేలా అమెరికా చూసుకుంది. మెక్సికో, కెనడా చెరి 13 నిర్వహిస్తాయి.

'క్రీడలు ప్రపంచాన్ని ఏకం చేస్తాయి... దేశాల మధ్య సరిహద్దులు చెరిపేస్తాయి' అని క్రీడల నిర్వాహకులు తరచు చెప్పేదంతా బడాయి తప్ప నిజం కాదని మళ్లీ రుజువైంది. 'కొత్త బిచ్చగాడు పొద్దెరగడ'న్నట్టు ఈమధ్య శ్వేతజాతి దురహంకారాన్ని ఒళ్లంతా పులుముకుంటున్న అమెరికా, అతిగా వ్యవహరిస్తూ ఈ సంరంభాన్ని నీరుగార్చే పోకడ లకు పోతోంది. ఫిఫా రిఫరీ, సోమాలియా క్రీడాకారుడు ఒమర్ అర్టన్ ఈ సంరంభం కోసం మయామీలో దిగిన వెంటనే ఆయన్ను వెనక్కి పంపింది. ఒమర్‌కు దౌత్య వీసా కూడా ఉంది. అతను 'జాతీయ భద్రత'కు ముప్పు తెస్తాడంటోంది అమెరికా. ఇరాన్ బృందానికి కూడా ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. అరిజోనాలో శిక్షణ మ్యాచ్‌లు నిర్వహించుకోవాల్సిన ఆ బృందం ఈ కారణంగా మెక్సికోకు మార్చుకోవాల్సి వచ్చింది. మ్యాచ్ జరిగే రోజున వచ్చి వెనుదిరగాలట! ఇలాంటి ఆంక్షలు సహజంగానే ఆటగాళ్ల మానసిక స్థైర్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయి.

అమెరికా ఉన్మాదం అక్కడితో ఆగలేదు. మ్యాచ్‌లలో ఇరాన్ అభిమానులుగా వచ్చే వారికి సైతం వీసాలు ఎగ్గొట్టింది. షికాగో విమానాశ్రయంలో దిగిన ఇరాక్ బృందం వైస్ కెప్టెన్ ఆయమాన్ హుస్సేనీని నిర్బంధించి, ఏడుగంటలపాటు ప్రశ్నలతో వేధించి, సోదాలు జరిపి విడిచిపెట్టింది. ఆయనతో వచ్చిన బృందం ఫొటోగ్రాఫర్‌ని వెనక్కి పంపింది. సెనెగల్, మొరాకో, ఉజ్బెకిస్తాన్ బృందాల్ని దుస్తులు విప్పించి నేరగాళ్ల మాదిరిగా పరిగణించారు. 90 మంది మొరాకో అభిమానులకూ ఈ 'మర్యాదే' ఎదురైంది. వారి రాకపై సందేహాలున్నాయట! దక్షిణాఫ్రికా బృందం వీసాల కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ఇంతవరకూ తేల్చలేదు. ఇప్పటికే అమెరికాలో హోటల్ గదులు రిజర్వ్ చేయించుకోవటంతో పలువురికి లక్షల డాలర్లు వృథా అయ్యాయి.

చిత్రమేమంటే... ఈ క్రీడాకారులూ, వారి అభిమానుల్లో ఒక్కరంటే ఒక్కరికి కూడా నేరచరిత్ర లేదు. నిజానికి ఉగ్రవాదమంటే వణికే అమెరికా ఈ దేశాలన్నిటిపైనా పలు సందర్భాల్లో దురాక్రమణలకు దిగింది. వాటిని వల్లకాళ్లుగా మార్చింది. అధినేతలను కాల్చిచంపింది. దీన్ని ఏమనాలి? చేసిందంతా చేసి దొంగే 'దొంగ... దొంగ' అని అరిచి నట్టు ఇప్పుడీ వికృత చర్యలేమిటి? విషాదమేమంటే ఇదంతా చూస్తూ కూడా ఫిఫా నోరుమూసుకుని కూర్చోవటం! అమెరికాలో ఫిఫా ఈవెంట్లు జరిగితే సమస్యలొస్తాయేమోనని 2017లో ఒక సందర్భంలో ఫిఫా అధ్యక్షుడు గియానీ ఇన్‌ఫాంటినోను అడిగితే... 'ఫిఫా ఏం చెప్తే అదే చెల్లుతుంది.

అమెరికా మొండికేస్తే అక్కడ వేడుకలు రద్దవుతాయి' అని గంభీరంగా చెప్పారు. ఇప్పుడు వీసా నిరాకరణలూ, వేధింపులూ ఆతిథ్యం ఇచ్చే దేశానికి సంబంధించినవని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఎందుకీ పిరికితనం? 2013లో బ్రెజిల్‌నూ, 2022లో ఖతార్‌నూ వరల్డ్ కప్ ఈవెంట్‌లు రద్దవుతాయని బెదిరించి, ప్రత్యేక చట్టాలు చేయించినప్పుడు ఈ 'విశాల హృదయం' ఎటుపోయింది? దక్షిణార్థగోళ దేశాలంటే చులకనా? అప్పట్లో ఖతార్‌లో స్వేచ్ఛ లేదంటూ నోళ్లు నొక్కుకుని నిరసన తెలిపిన జర్మనీ ఆటగాళ్లు ఈసారి అమెరికాలో ఆ సాహసం చేయగలరా? కడివెడు పాలల్లో విషపు చుక్కలా ఉన్న అమెరికా తీరుపై కళ్లుమూసుకుంటే భవిష్యత్తులో ఇలాంటి ఈవెంట్లపై అందరిలోనూ ఆసక్తిపోతుందని ఫిఫా గుర్తించాలి.

## కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత గుమ్మడి గోపాలకృష్ణకు జిల్లా యంత్రాంగం ఘన సన్మానం

**(వి న్యూస్ - మచిలీపట్నం):** ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్, ప్రముఖ తెలుగు రంగస్థల కళాకారుడు, పద్యనాటక గాన గంధర్వుడు కళారత్న గుమ్మడి గోపాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక సంగీత నాటక అకాడమీ అవార్డు ప్రకటించడం పట్ల జిల్లా కలెక్టర్ డీకే బాలాజి హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం మేడూరు గ్రామానికి చెందిన గుమ్మడి గోపాలకృష్ణ 1955లో జన్మించారు. ప్రముఖ నాటకకర్త ఆచంట వెంకటరత్నం ప్రోత్సాహంతో 1982లో నాటక రంగంలో ప్రవేశించి, తన అపూర్వ ప్రతిభతో తెలుగు రంగస్థల కళారంగంలో విశిష్ట స్థానం



సంపాదించుకున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ డిజిటల్ సాంకేతికతను వినియోగించి నాటక రంగాన్ని యువతరానికి చేరువ చేసేందుకు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి (ఎఫ్ఏసీ) ఎస్. పోతురాజు, పమిడిముక్కల తహశీల్దారు గుమ్మడి గోపాలకృష్ణను స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. తెలుగు నాటక రంగానికి గుమ్మడి గోపాలకృష్ణ అందించిన సేవలకు గుర్తింపుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు లభించడం జిల్లాకు గర్వకారణమని ఈ సందర్భంగా జిల్లా అధికారులు పేర్కొన్నారు.

## బీఎల్ఏలకు అవగాహన సమావేశం

**(వి న్యూస్ -మచిలీపట్నం):** ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సర్ కార్యక్రమం నేపథ్యంలో మచిలీపట్నం రూరల్ పార్టీ కార్యాలయంలో బూత్ లెవల్ ఏజెంట్లు కోసం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలపై నాయకులు బీఎల్ఏలకు మార్గనిర్దేశనం చేశారు.



అలాగే ఓటర్లకు సర్కా ర్యక్రమం గురించి ఎలా అవగాహన కల్పించాలి, ఓటరు జాబితా పరిశీలన, అవసరమైన పత్రాల సమర్పణ, ఎన్నికల నిబంధనలపై ప్రజలకు స్పష్టంగా వివరించి వారిని చైతన్యవంతులను చేయాలని సూచించారు. పార్టీ శ్రేణులు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హులైన ఓటరుకు సమాచారం చేరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, సీనియర్ టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ , కుంచే నాని , కాగిత వెంకటేశ్వరరావు , లంకె శేషగిరిరావు, తలారి సోమశేఖర్ , కాగిత గోపాలరావు , శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతన ఆర్ఎంఓగా డా. జి భానుమూర్తి

**(వి న్యూస్ - మచిలీపట్నం):** ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రి వరుసగా జరుగుతున్న సంఘటనల దృష్ట్యా గౌరవ మంత్రి ఆసుపత్రి అధికారులను నియమించి ,ఆసుపత్రి అభివృద్ధి కి కంకణం కట్టుకున్నారు. అందులో భాగంగా హెచ్ డి ఎస్ కమిటీ వేయడం ఇపుడు ఆర్ ఎం ఓ గా డా. జి భానుమూర్తి,కంటి వైద్య నిపుణులు నియమించారు. డా.భాను మూర్తి ప్రస్తుత జిల్లా అంధత్వ నివారణ అధికారి గా ఉంటూ కృష్ణ జిల్లాను కంటి శస్త్ర చికిత్సల్లో రాష్ట్రంలో టాప్ 10 లో నిలిపారు. ఉప పర్యవేక్షణ అధికారి గా,ఎ డి గా పనిచేసిన అపార అనుభవం ఉంది. ఆయన చేసిన సేవా కార్యక్రమాలకు ఎంతో మంది ఉన్నత అధికారుల నుంచి సేవా పురస్కారాలు పొంది ఉన్నారు. అసిస్టెంట్ ఆర్ ఎం ఓ గా అర్థో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రాజన్, డా.నాగలక్ష్మి లను నియమించడం జరిగింది.



## భారతీయులున్న నౌకలపై అమెరికా దాడులు.. వెంటనే ఆపాలి : కేంద్రం

**ఢిల్లీ :** ఒమన్ తీరానికి సమీపంలో భారతీయులున్న నౌకలపై వరుసగా దాడులు జరిగాయి. వారం వ్యవధిలో మన దేశీయులున్న మూడు నౌకలు అమెరికా సైన్యానికి లక్ష్యంగా మారాయి . ఈ ఘటనలపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ దాడులు తీవ్ర ఆందోళనకరమని, తక్షణమే వాటిని ఆపేయాలని పేర్కొంది. ఈ మేరకు విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ మీడియాతో మాట్లాడారు. "కొన్నిరోజులుగా పశ్చిమాసియాలో భారత నావికులు లక్ష్యంగా కొన్ని ఘటనలు చోటుచేసుకున్నాయి. ఒమన్ తీరంలో ఒక నౌకపై నిన్న జరిగిన దాడిని తీవ్రంగా ఖండించాం. ఆ ఘటనలో ముగ్గురు భారతీయుల్ని కోల్పోయాం. దిల్లీలో అమెరికా దౌత్యాధికారిని పిలిపించి తీవ్ర నిరసన తెలియజేశాం. ఈ ప్రాంతంలో నౌకలపై నిరంతరం జరుగుతోన్న దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ఫలితమే ఈ ఘటనలు. ఈ దాడులు వెంటనే ఆపివేయాలి. చర్చలు, దౌత్యంతో ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పే ప్రయత్నాలు చేయాలి" అని జయస్వాల్ పిలుపునిచ్చారు.

దాడులకు సంబంధించిన వివరాలను షిప్పింగ్ మినిస్ట్రీ అడిషనల్ సెక్రటరీ ముకేశ్ మంగళ్ వెల్లడించారు. జూన్ 8 నుంచి ఈ దాడులు జరుగుతున్నాయని చెప్పారు. ఆరోజున మారివెక్స్ నౌకలో మంటలు చెలరేగాయి. అందులోని 24 మంది భారతీయులు సురక్షితంగా బయటపడ్డారు.

## రుద్రాక్ష సింధూర పూజ



**(వి న్యూస్ - కృత్తివెన్ను):** విశ్వహిందూ పరిషత్ కృష్ణ జిల్లా వారి ఆధ్వర్యంలో కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం దళితవాడ రామాలయంలో రుద్రాక్ష సింధూర పూజ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ ప్రముఖ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం,సెక్రటరీ వి.రాజశేఖర్,కే.శ్రీనివాస రావు ఉత్తరాంధ్ర ప్రాంతం కార్యదర్శి సుబ్బరాజు, వసుంధర, సాయిలత, కృత్తివెన్ను మండలం నుంచి జగపతి,ప్రకాశరావు,నాగేశ్వరరావు పాల్గొన్నారు.అనంతరం విశ్వహిందూ పరిషత్ ప్రెసిడెంట్ డా.బి.శ్రీనాథ్,జిల్లా ప్రబావారి పి వి ఎస్ నాయుడు అభినందనలు తెలిపారు.

## విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఐసీసీ--సీఎన్ఎస్ -2026 అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

**(వి న్యూస్ - చేబ్రోలు):** సైబర్ భద్రత, నెట్‌వర్కింగ్ వ్యవస్థల సామర్థ్య పెంపులో కృత్రిమ మేధస్సు (ఏఐ) కీలక పాత్ర పోషిస్తోందని ఐఈఈఈ కేరళ సెక్షన్ చైర్మన్ ప్రొఫెసర్ బీ.ఎస్. మనోజ్ పేర్కొన్నారు. నెట్‌వర్క్‌లపై జరిగే దాడులను వేగంగా గుర్తించడం, అనుమానాస్పద కార్యకలాపాలను విశ్లేషించడం, భద్రతా లోపాలను ముందుగానే గుర్తించి నివారించడం వంటి అంశాల్లో ఏఐ అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తోందన్నారు.గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో, ఐఈఈఈ , ఐఈఈఈ కమ్యూనికేషన్స్ సొసైటీ సాంకేతిక సహకారంతో నిర్వహిస్తున్న మూడు రోజుల 2026 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ కాగ్నిటివ్ కంప్యూటింగ్ అండ్ నెట్‌వర్కింగ్ సిస్టమ్స్ (ఐసీసీ--సీఎన్ఎస్ --2026) గురువారం ప్రారంభమైంది. కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన అనంతరం సదస్సుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ బుక్‌ను ఆవిష్కరించారు. కాగ్నిటివ్ కంప్యూటింగ్, ఇంటెలిజెంట్ నెట్‌వర్కింగ్, ఏఐ ఆధారిత డేటా - డ్రివెన్ సిస్టమ్స్ వంటి అంశాలపై దేశ విదేశాలకు చెందిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు మొత్తం 109 పరిశోధనా పత్రాలను సదస్సుకు సమర్పించారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఈఈఈ కేరళ సెక్షన్ చైర్మన్ ప్రొఫెసర్ బీ.ఎస్. మనోజ్ మాట్లాడుతూ, ఏఐ ఆధారిత నెట్‌వర్కింగ్ భవిష్యత్ డిజిటల్ ప్రపంచానికి పునాదిగా మారుతోందన్నారు. నెట్‌వర్క్ ట్రాఫిక్ విశ్లేషణ, డేటా ప్రవాహ నిర్వహణ, భద్రతా ముప్పుల గుర్తింపులో ఏఐ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని తెలిపారు. సంప్రదాయ నెట్‌వర్క్ నిర్వహణలో అధిక మానవ జోక్యం అవసరమయ్యేదని, ప్రస్తుతం ఏఐ ఆధారిత వ్యవస్థలు స్వయంగా పనితీరును విశ్లేషించి అవసరమైన మార్పులు అమలు చేసే స్థాయికి చేరుకున్నాయని చెప్పారు.5జీ, 6జీ కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, క్లౌడ్ కంప్యూటింగ్, స్మార్ట్ సిటీల అభివృద్ధిలో ఏఐ కీలకంగా మారిందని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు ఏఐ--నెట్‌వర్కింగ్ రంగాల్లో సంయుక్త పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన బెంగళూరులోని శామ్‌సంగ్



ఆర్ అండ్ డీ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ మధన్ రాజ్ కనగరత్నం మాట్లాడుతూ, ఏజెంటిక్ ఏఐ భవిష్యత్ నెట్‌వర్కింగ్ వ్యవస్థలను మరింత స్వయంప్రతిపత్తి కలిగినవిగా తీర్చిదిద్దుతోందన్నారు. సాధారణ జనరేటివ్ ఏఐతో పోలిస్తే, ఏజెంటిక్ ఏఐ పరిస్థితులను విశ్లేషించి లక్ష్యాల సాధన కోసం కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి స్వయంగా చర్యలు చేపట్టగలదని వివరించారు.పెరుగుతున్న డేటా ట్రాఫిక్, భద్రతా సవాళ్ల నేపథ్యంలో ఏజెంటిక్ ఏఐ ఆధారిత నెట్‌వర్క్‌లు సమస్యలను ముందుగానే అంచనా వేసి, అవసరమైన మార్పులను స్వయంచాలకంగా అమలు చేయగలవని తెలిపారు. స్వయంప్రతిపత్తి నెట్‌వర్క్‌లు భవిష్యత్ టెలికమ్యూనికేషన్ రంగంలో కీలక సాంకేతికతగా అవతరిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన టీసీఎస్ గ్లోబల్ హెడ్, ఐఈఈఈ హైదరాబాద్ సెక్షన్ వైస్ చైర్మన్ బాలా ప్రసాద్ పెద్దిగారి మాట్లాడుతూ, కనెక్టెడ్ ఇంటెలిజెన్స్ అనేది కేవలం పరికరాల అనుసంధానం మాత్రమే కాకుండా, వాటి ద్వారా సేకరించే డేటాను విలువైన నిర్ణయాలుగా మార్చే సమగ్ర వ్యవస్థ అని అన్నారు. తయారీ, ఆరోగ్య సేవలు, వ్యవసాయం, రవాణా, విద్యుత్ పంపిణీ వంటి రంగాల్లో డేటా ఆధారిత నిర్ణయాలు ఉత్పాదకత పెంపునకు దోహదపడుతున్నాయని తెలిపారు.స్మార్ట్ నగరాల అభివృద్ధిలో కనెక్టెడ్ ఇంటెలిజెన్స్ కీలకమని, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా భద్రత, నీటి సరఫరా, వ్యర్థాల నిర్వహణ వంటి సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. అయితే డిజిటల్ అనుసంధానం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ భద్రత, డేటా గోప్యత, నైతిక వినియోగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు.అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బెంగళూరులోని శామ్‌సంగ్ ఆర్ అండ్ డీ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ మధన్ రాజ్ కనగరత్నం, టీసీఎస్ గ్లోబల్ హెడ్, ఐఈఈఈ హైదరాబాద్ సెక్షన్ వైస్ చైర్మన్ బాలా ప్రసాద్ పెద్దిగారి, ట్రినిటీ కాలేజ్ డబ్లిన్ (ఐర్లాండ్)కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ మాజిద్ బట్, న్యూకాసిల్ యూనివర్సిటీ (యూకే) ప్రొఫెసర్ డాక్టర్ దీపాయన్ భౌమిక్ , యూనివర్సిటీ ఆఫ్ హాట్ అల్సాస్ (ఫ్రాన్స్)కు చెందిన ప్రొఫెసర్ డా. పాస్కల్ లోరెంజ్, విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించిన సీఐ ఎస్ వి వి లక్ష్మీనారాయణ



**(వి న్యూస్ – విజయవాడ):** రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించేందుకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ ఎస్ వి వి లక్ష్మీనారాయణ సూచించారు. హెల్మెట్ ప్రాణరక్షక కవచమని పేర్కొంటూ వాహనదారులకు అవగాహన కల్పించారు. అలంకార్ సెంటర్ ప్రధాన కూడలిలో సీఐ ఎస్ వి వి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే వారు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు తమ కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎల్లప్పుడూ హెల్మెట్ ధరించాలని సీఐ కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ షబీర్, సౌజన్య, పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

# త్రాగునీటి నిల్వ సామాగ్రి వితరణ




**(వి న్యూస్ – కలిదిండి):** స్థానిక మండల పరిధిలోని కొచ్చర్ల గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు, గతంలో ఉన్నటువంటి త్రాగునీటి సామాగ్రి పాడైపోయిన సందర్భంలో స్థానిక గ్రామ సర్పంచ్ ఆల రాము ఉదారతను చాటారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు చక్రవర్తి ద్వారా సదరు విషయాన్ని తెలుసుకుని ,గ్రామ పాఠశాల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితిని అర్థం చేసుకుని, తన వంతు సాయంగా సుమారు 6000 రూపాయలు విలువగల త్రాగునీటి సామాగ్రిని పాఠశాలకు వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదని తనవంతు సాయంగా ఈ వితరణ చేయడం జరిగిందని ఆయన తెలియజేశారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ శక్తి మేర ముందుకు రావాలని ఆయన పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# చిలకలూరిపేట సాయిబాబా ఆలయాన్ని దర్శించుకున్న డీఎస్పీ ఎం హనుమంతరావు



**(వి న్యూస్ – చిలకలూరిపేట):** చిలకలూరిపేట పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయాన్ని నరసరావుపేట డీఎస్పీ ఎం హనుమంతరావు గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన డీఎస్పీకి ఆలయ కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. గురువారం కావడంతో ఆలయంలో బాబా వారికి ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. డీఎస్పీ హనుమంతరావు ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొని బాబా వారిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం డీఎస్పీ ఆలయ ప్రాంగణంలోని గోశాలను సందర్శించారు. అక్కడ ఉన్న గోవులకు ఆయన స్వయంగా బెల్లం తినిపించి గోసేవ చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూఆలయ వాతావరణం, నిర్వహణ ఎంతో ప్రశాంతంగా, అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఆలయ ట్రస్ట్ నిర్వాహకులు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ గుడి నిర్వహణ చాలా చక్కగా సాగుతోందని కొనియాడారు. కేవలం ఆలయ నిర్వహణే కాకుండా, విజయ్ కుమార్ సొంత ఖర్చులతో దాదాపు 34 ఒంగోలు జాతి ఆవులను సంరక్షిస్తూ గోశాలను నడపడం గొప్ప విషయమని, తాము కూడా గోవులకు బెల్లం తినిపించి గోసేవలో పాల్గొన్నామని సంతోషం వ్యక్తం చేశారు. 2018 ఆగస్టు 30న ఈ ఆలయ ప్రతిష్ఠాపన జరిగిందని అప్పటి నుండి ప్రతి సంవత్సరం వార్షికోత్సవం రోజున స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు ఎంతో వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. పట్టణ ప్రజలందరికీ ఇదొక మంచి ఆధ్యాత్మిక అవకాశమని, ఆలయ కమిటీ వారు భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న విజయ్ కుమార్ కి ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ చల్లా విజయ్ కుమార్ డీఎస్పీ హనుమంతరావుకు 'సాయి సచ్చరిత్ర' పవిత్ర గ్రంథాన్ని బహుకరించి, శాలువాతో సత్కరించారు. పత్తిపాటి ఫౌండేషన్ కన్వీనర్ కంచర్ల శ్రీనివాసరావు, టిడిపి నాయకులు ఆర్ ఐ మల్లికార్జునరావు, పావులూరి వెంకటేశ్వర్లు, షేక్ కాసింహుడ (వ్యాయామ ఉపాధ్యాయులు )ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా బుక్ డొనేషన్ డ్రైవ్ కార్యక్రమం

## - రాష్ట్రంలోనే కృష్ణా జిల్లా గ్రంథాలయ సేవలు ఆదర్శం: జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్

**(వి న్యూస్ – మచిలీపట్నం):** కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ని జిల్లా కేంద్ర గ్రంథాలయం లో హరిత ఫౌండేషన్ సహకారంతో బుధవారం బుక్ డొనేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడే విలువైన పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయం తో పాటు వివిధ శాఖా గ్రంథాలయాలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.ఎస్. బేగ్, హరిత ఫౌండేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ సాందేపని వర్జె హాజరయ్యారు.

రాష్ట్రస్థాయిలో కృష్ణా జిల్లా గ్రంథాలయాల సేవలు అద్భుతం: ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని గ్రంథాలయాలతో పోల్చితే, కృష్ణా జిల్లా గ్రంథాలయాల పనితీరు అత్యుత్తమంగా ఉందని కొనియాడారు. చైర్మన్, కార్యదర్శి సిబ్బంది అంకితభావంతో పాఠకులకు మెరుగైన సేవలు అందిస్తున్నారని అభినందించారు. విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.




రూ. 20 లక్షల విలువైన పుస్తకాల వితరణ: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.ఎస్. బేగ్ మాట్లాడుతూ, సుమారు రూ. 20 లక్షల విలువైన పుస్తకాలను అందించిన హరిత ఫౌండేషన్, ఎమెస్కో బుక్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇతర దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పుస్తకాలు గ్రామీణ ప్రాంతాల్లోని పాఠకులకు, పోటీ పరీక్షల అభ్యర్థులకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

నైతిక విలువలే ఉన్నత శిఖరాలకు చేరుస్తాయి: హరిత ఫౌండేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ సాందేపని వర్జె మాట్లాడుతూ, విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించడంతో పాటు, ఉద్యోగ జీవితంలో నైతిక విలువలను పాటించాలని సూచించారు. తాము ఎదిగి సమాజానికి తిరిగి సేవ చేసే స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

నిరంతర అభివృద్ధి కి కృషి: జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి. రవికుమార్ మాట్లాడుతూ, గ్రంథాలయాల అభివృద్ధికి పాఠకులకు మెరుగైన వసతులు కల్పించేందుకు తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అలాగే, డిప్యూటీ లైబ్రేరియన్ బీరెం వెంకటరమణ మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన సమ్మర్ క్యాంప్ విజయవంతమైందని, దాతలు అందించిన పుస్తకాలను త్వరలోనే శాఖా గ్రంథాలయాలకు పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జి. రాధికా రాణి, యు. యోగేశ్వరరావు, బి. రమేష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది, రిఫరెన్స్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాఠకులు పాల్గొన్నారు.

# సిపిఎం నేతలపై అక్రమ కేసును కొట్టివేసిన కోర్టు

## - అక్రమ కేసులను తొలగిస్తామని హామీ ఇచ్చి, మాట తప్పిన కూటమి ప్రభుత్వం

**(వి న్యూస్ – విజయవాడ):** 2021 జూన్ 16 వ తేదీన అధిక ధరలు, పెట్రోల్, డీజిల్ రేట్ల పెంపుదలకు వ్యతిరేకంగా సిపిఎం, సిఐటియు నేతలు, కార్యకర్తలు గవర్నర్ పేట సచివాలయం వద్ద శాంతియుతంగా ఆందోళన నిర్వహించారు. నాటి వైసిపి ప్రభుత్వం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు డి. కాశీనాథ్, సిఐటియు నేత సిహెచ్. మురళి లపై అక్రమ కేసులు మోపింది. సెక్షన్లు 341,188, 269, 143 తీ/ష 149 ఐపిసి క్రింద కేసులు నమోదు చేశారు, ఎఫ్ ఐ ఆర్ 2 10/ 21 గా నమోదయింది.లి

అప్పటినుండి అప్పటినుండి పలు దఫాలుగా విచారించిన 3వ అజవీ కోర్టు గురువారం కేసును కొట్టివేసింది, మూడవ అడిషనల్ మెజిస్ట్రేట్ కేసును విచారించి అక్రమ కేసుగా నిర్ధారించి కొట్టివేశారు. ఈ కేసులో ప్రముఖ న్యాయవాదులు సుంకర రాజేంద్రప్రసాద్, ఎస్. రమేష్ న్యాయసహాయం అందించారు. ప్రజా సమస్యలపై సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాలు నిరంతర పోరు సాగిస్తున్నాయి, పాలక పార్టీలు ఉద్యమాలను అక్రమంగా అణిచివేయటానికి పూనుకుంటున్నాయి. పాలకులు తమపై ఉన్న అవినీతి కేసులను మాత్రం ప్రజల, ప్రభుత్వ సొమ్ముతో ప్రముఖ న్యాయవాదులను వినియోగించి కేసులను లేకుండా చేసుకోవటానికి శతవిధాల ప్రయత్నిస్తున్నారు. కొందరు నేతలు తమపై ఆర్థిక ఇతర నేరారోపణలతో, సంవత్సరాల తరబడి కేసులు జరుగుతున్నా, కోర్టులకు కూడా హాజరుకాకుండా కాలయాపన చేస్తున్నారు. ప్రభుత్వాలను వినియోగించుకుని వారిపై ఉన్న కేసులను తొలగించుకుంటున్నారు. మరోవైపు సామాన్యులు, కమ్యూనిస్టులు, ఉద్యమకారులపై మాత్రం అక్రమ కేసులు పెట్టి, సంవత్సరాల తరబడి కోర్టులు చుట్టూ తిప్పుతున్నారు. ప్రజా ఉద్యమాలపై పెట్టిన అక్రమ కేసులను తొలగిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పింది. ప్రజలు వాస్తవాలను గమనించి ప్రభుత్వ నిర్బంధాలను, అక్రమ కేసులను ఖండించాలి.

V స్మార్ట్ యాడ్స్

**Insurance**
యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అన్ని రకాల వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించబడును. ఇన్సూరెన్స్ చేయించుకోదలచిన వారు సంప్రదించండి: టి.సి.ఎన్ శ్రీనివాస్. 9246761404 08672-221097

**మస్కిటో డోర్స్&విండోస్**
చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్... అల్యూమినియమ్ మస్కిటో డోర్స్&విండోస్ తయారు చేయబడును. మరియు రిపేర్ చేయబడును. సంప్రదించండి: చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్ గొడుగుపేట-మచిలీపట్నం సెల్:9182197822 9121605277

వి స్మార్ట్ యాడ్స్ కేవలం రూ.100/-లకే స్మార్ట్ యాడ్..
----------
సంప్రదించండి 9848667347

చెదల నివారణకు
K. Vasantha Rao
DAYA PEST CONTROLLING WORK
Cell: 8333099449
నివారణ గ్యారెంటీ... మచిలీపట్నం.

శ్రీ శివరామకృష్ణ జ్యోతిష్యాలయము
శంకర మఠం ప్రక్కన, గొడుగుపేట, మచిలీపట్నం.
జాతక పరిశీలన చేసి వివాహ, ఉద్యోగ, వ్యాపార, సంతాన తదితర విషయాల్లో దోషాలకు పరిహారాలు సూచించబడును.
వివాహ పొంతన పరిశీలించబడును. సుముహూర్త నిర్ణయం చేయబడును.
సంప్రదించండి : 96407 54054-91828 17435

**తక్కువధరకే ప్రకటనలు**
ఇల్లు/స్థలం అమ్మలన్నా, కొనాలన్నా, అద్దెకు ఇవ్వాలన్నా, ఉద్యోగం కావాలన్నా, ఉద్యోగులు కావాలన్నా తక్కువ ధరతో విన్యూస్‌లో ప్రకటన ఇచ్చి నిశ్చింతంగా ఉండండి. మరిన్ని వివరాలకు సంప్ర: 9848667347

# అక్టోబర్‌లో మెగా డిఎస్సీ నోటిఫికేషన్.. : రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్

## - డిసెంబర్‌లో పరీక్షలు...అభ్యర్థులు సన్నద్ధం కావాలి

**అమరావతి :** రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ప్రభుత్వం మరోసారి శుభవార్త అందించింది. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు అనుగుణంగా అక్టోబర్ నెలలో మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు, డిసెంబర్ నెలలో పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, శాప్ వైస్ చైర్మన్ ఒ మేనేజింగ్ డైరెక్టర్ భరణితో కలసి ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ డిఎస్సీ-2025 నియామకాలపై మరొక సారి సమగ్ర వివరణ ఇచ్చారు. డీఎస్సీ-2025 నియామకాల్లో హారిజాంటల్ రిజర్వేషన్లు, స్పోర్ట్స్ కోటా, దివ్యాంగుల కోటా అమలుపై కొంత మంది అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న సందేహాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాల్లో ఏమాత్రం నిజం లేదని ఆయన స్పష్టం చేశారు.

2024లో నోటిఫై చేసిన సుమారు 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తికాకపోవడానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల మేరకు హారిజాంటల్ రిజర్వేషన్ల అమలులో పూర్తి చట్టబద్ధత, స్పష్టత, నిబంధనల అనుసరణను నిర్ధారించాల్సిన అవసరం ఏర్పడటంతో పాటు, టెట్--డీఎస్సీ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించి అభ్యర్థులకు ఎటువంటి గందరగోళం లేకుండా పరిపాలనా సౌలభ్యాన్ని కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ రెండు అంశాల నేపథ్యంలో నియామక ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల్సి రావడంతో పోస్టుల భర్తీ ఆలస్యమైనట్లు ఆయన స్పష్టం చేశారు.

**డిఎస్సీ ప్రక్రియలో పేపర్ లీకేజీకి అవకాశమే లేదు...**

డిఎస్సీ నియామక ప్రక్రియ పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడిందని కోన శశిధర్ తెలిపారు. సిస్టమ్‌కు పరిమిత సంఖ్యలో మాత్రమే అధికారిక యాక్సెస్ ఉంటుందని, కేవలం ఇద్దరు నియమిత శాశ్వత ఉద్యోగులు మాత్రమే డేటా అప్‌లోడ్ చేసే అధికారం కలిగి ఉంటారని తెలిపారు. పాస్‌వర్డులు నిరంతరం మార్చబడుతూ ఉంటాయని, అనధికార ప్రవేశానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. అందువల్ల డేటా లీకేజీ లేదా పేపర్ లీకేజీకి ఎటు వంటి అవకాశం ఉందన్నారు.

**మెరిట్ లిస్ట్ తయారీ పూర్తిగా నిబంధనల ప్రకారం...**

డిఎస్సీ ఎంపికల్లో టెట్ మార్కులకు 20 శాతం, డిఎస్సీ మార్కులకు 80 శాతం వెయిటేజీ ఇచ్చి జనరల్ మెరిట్ లిస్ట్ రూపొందించినట్లు ఆయన తెలిపారు. టెట్ మార్కులను ఇప్పటికే అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ కోసం కాల్ లెటర్ రావడం అంటే అభ్యర్థి ఎంపికైనట్లుగా కాదని ఆయన మరోసారి స్పష్టం చేశారు. హారిజాంటల్ రిజర్వేషన్లు, సర్టిఫికేట్ వెరిఫికేషన్, అర్హత నిర్ధారణ తదితర అంశాల ఆధారంగా తుది ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఒక అభ్యర్థికి కాల్ లెటర్ వచ్చినప్పటికీ, వెరిఫికేషన్ సమయంలో అనర్హత తేలితే తదుపరి అభ్యర్థికి అవకాశం దక్కవచ్చని వివరించారు.

**గ్రీవెన్స్ పరిష్కారానికి మూడు స్థాయిల వ్యవస్థ...**

అభ్యర్థుల అభ్యంతరాల పరిష్కారం కోసం ప్రభుత్వం మూడు స్థాయిల్లో గ్రీవెన్స్ మెకానిజాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా స్థాయి పరిశీలన, రాష్ట్ర స్థాయి కమిటీ, కమిషనర్ స్థాయి తుది పరిశీలనతో అభ్యర్థుల అభ్యంతరాల పరిష్కరించడం జరుగుచున్నదన్నారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా పరిశీలించినట్లు ఆయన వెల్లడించారు.

**స్పోర్ట్స్ కోటా నియామకాలపై పూర్తి వివరణ...**

స్పోర్ట్స్ కోటా నియామకాల విషయంలో ప్రభుత్వం అమలులో ఉన్న నిబంధనలు, జీఓల ప్రకారం పూర్తిస్థాయి పారదర్శకతతో ఎంపికలు నిర్వహించినట్లు రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ స్పష్టం చేశారు.

# తూనికలు, కొలతల్లో పురాతన పద్ధతికి స్వస్తి పలకండి

## మంత్రి నాదెండ్ల మనోహర్

**(విన్యూస్, విజయవాడ) :** మారుతున్న కాలానికి తగినట్లుగా తూనికలు కొలతలు శాఖ తన పనితీరును మార్చుకోవల్సిన అవసరం ఉంది. పాత పద్ధతులు వీడి అధునాతన సేవల్లోకి మారాలి. ప్రజల్లో అవగాహన, చైతన్యం పెరుగుతున్న వేళ, దానికి అనుగుణంగా తూనికలు, కొలతల శాఖ తన సేవలను మెరుగుపర్చుకోవాలని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ, తూనికలు కొలతల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ప్రజలకు అత్యంత దగ్గరగా సేవలందించాల్సిన శాఖలో ఇంకా ప్రాచీనకాలం నాటి పని విధానమే కనిపిస్తోంది. దీనిని అధిగమించేందుకు సరికొత్త ఆలోచనలు, విధానాలను, ఇన్నోవేషన్లు తీసుకురావాలి. రాష్ట్రం కంట్రోలర్ దగ్గర నుంచి ఇన్స్ పెక్టర్ల వరకు నిత్యం క్షేత్రస్థాయిలో పనిచేసి, తూనికలు, కొలతల్లోని మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. వచ్చే ఖరీఫ్ ధాన్యం సేకరణ చాలా కీలకమని, ఆ సమయాల్లో తూనికలు, కొలతలు శాఖ కూడా తన సిబ్బందిని అప్రమత్తం చేసి రైతుకు అన్యాయం జరగకుండా, తూకాల్లో తేడాలు రాకుండా క్షేత్రస్థాయిలో చూడాలని ఆదేశించారు. గురువారం పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యాలయంలో తూనికలు, కొలతలు శాఖ అధికారులు, సిబ్బందితో శాఖ పనితీరు, భవిష్యత్తులో తీసుకురావల్సిన విధానాలపై మంత్రివర్యులు ప్రత్యేక సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ... " వినియోగదారుల భద్రత, నమ్మకాన్ని నిలబెట్టుకునేలా శాఖ పనిచేయాలి. కేవలం ట్రేడర్స్ దగ్గరకు వెళ్లి మీ కేసులు, సాధారణ పనులు, తనిఖీలు చేసుకుంటే సరిపోదు. మారుతున్న కాలానికి తగినట్లుగా ప్రజలతో మమేకం కావల్సిన అవసరం ఉంది. కేవలం నిబంధనల మేరకు కేసులు రాసుకుంటాం.. తనిఖీలు చేసి వచ్చేస్తాం అనుకుంటే పని పూర్తి కాదు. నకిలీలు, కొలతల్లో తేడాలను వేగంగా గుర్తించే సాంకేతికతను మెరుగుపర్చుకోండి. తెర వెనుక ఉన్న అసలు తప్పులను ఎత్తి చూపితేనే అసలు ప్రయోజనం కనిపిస్తుంది.

ఆహార పదార్థాల నకిలీ, కల్తీ, బరువులు తగ్గడం వంటివి ఈ రోజుల్లో సర్వ సాధారణం అయ్యాయి. దీనికి తగినట్లుగా తూనికలు, కొలతల శాఖ కూడా విస్తృతంగా పనిచేసే విధానంలోకి మారాలి. గతంలో ఆహార పదార్థాల్లో జరిగే అవకతవకలపై ప్రత్యేకంగా టాస్క్ ఫోర్సును నియమించాం. దాన్ని మరింత సమర్ధంగా మళ్లీ టాస్క్ ఫోర్సును పునరుద్ధరించాలి. తూనికలు, కొలతలు విషయంలో చిన్నచిన్న తప్పులే పెద్ద విషయాలుగా మారతాయి. దీన్ని శాస్త్రీయపద్ధతిలో పున: తనిఖీలు చేసుకోవాలి. ఏ విషయం మీదనైనా ముందుకు వెళితే న్యాయపరంగానూ ఇబ్బందులు రాకుండా చూసుకోవాలి. మా నాన్న గారు కూడా 1978లోనే తూనికలు, కొలతల శాఖ మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు నేను కూడా అదే శాఖను నిర్వర్తిస్తున్నాను. మా కుటుంబానికి శాఖతో తగు అనుబంధం ఉంది. ఈ శాఖను పూర్తిగా ఆధునీకరించాలనేది ప్రణాళిక. దీనికోసం సిబ్బంది తగిన విధంగా సహకరించాలి.

ప్రస్తుత డిజిటల్ యుగంలో తూనికలు, కొలతల శాఖ వేగవంతమైన స్పందన ఎంతో అవసరం. ప్రజలు కొన్ని అంశాల్లో శాఖాపరమైన అంశాల్లో సోషల్ మీడియా వేదికగా స్పందించినపుడు, దానికి అనుగుణంగా వెంటనే రంగంలోకి దిగి సమస్యను పరష్కరిస్తే ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. ఫలితంగా శాఖ మీద వారికి గౌరవం ఏర్పడుతుంది. ప్రజల్లో మన పనితీరుతోనే నమ్మకం పెరుగుతోంది. తూనికలు, కొలతల శాఖ 2009 చట్టంలో వేగంగా వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలి. కేంద్రం సైతం ఇండియన్ స్టాండర్ట్స్ కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. తూనికలు కొలతల శాఖ తన సేవలను విస్తృతం చేసుకోవాలి.

### సిబ్బందిని తగిన విధంగా ప్రోత్సహిస్తాం

శాఖలోని సిబ్బంది ప్రజలకు సాయం చేయాలి. సేవ చేయాలనే ప్యాషన్ తో పనిచేయాలి. నిబంధనలు పాటిస్తూనే వస్తున్న అధునాతన సాంకేతికతను వినియోగించుకొని, మార్పులను అందిపుచ్చుకొని ప్రజలకు ఎలా సేవ చేయాలనే దానిపై ఆలోచించాలి. మెరుగైన సేవలు అందించే వారికి మా ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుంది. ఎన్ఫోర్స్మెంట్ అనేది ఎవరి పరిధిలో వారు చేయాలి. క్వాలిటీ ఆఫ్ వర్క్ అనేది చాలా అవసరం. అవినీతి దరిచేరనీవ్వకుండా పనిచేయడం మరింత ప్రధానం. శాఖకు ప్రతిష్టను తీసుకొచ్చే అధికారులను, సిబ్బందిని ఎల్లవేళలా మేం ప్రోత్సహిస్తాం." అని చెప్పారు. సమీక్ష సమావేశంలో పౌర సరఫరాల సంస్థ ఎండీ శ్రీ ఢిల్లీరావు, తూనికలు, కొలతల శాఖ జాయింట్ కంట్రోలర్ !కృష్ణ చైతన్య పాల్గొన్నారు.




# ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్య : జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ

**(విన్యూస్, విజయవాడ) :** ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందించి ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ఉన్నత ఫలితాలను సాధించాలన్న లక్ష్యంగా గత ఏడాది సాధించిన ఫలితాల స్ఫూర్తితో అడుగులు వేస్తున్నామని ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ప్రణాళికలను రూపొందించుకుని అమలు చేస్తున్నామని ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ ఎక్స్పోను జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందించి ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ఉన్నత ఫలితాలను సాధించాలన్న లక్ష్యంగా గత ఏడాది సాధించిన ఫలితాల స్ఫూర్తితో అడుగులు వేస్తున్నామని ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ప్రణాళికలను రూపొందించుకుని అమలు చేస్తున్నామని తెలిపారు. గత విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులు విద్యార్థులలో ప్రతిభను వెలికి తీసీ మంచి ఫలితాలను సాధించేందుకు కృషి చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఆధునిక బోధనా విధానాలు, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను




మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. గత విద్యా సంవత్సరంలో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు సాధించిన విజయాలు, ఉత్తీర్ణత శాతం స్ఫూర్తిగా ఈ విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలు, సౌకర్యాలు, విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించే విధంగా విద్యా ఎక్స్పోను నిర్వహిస్తున్నామని వివరించారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై పూర్తి అవగాహన పెంపొందించుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మౌళిక వసతులు విద్యబోధన సాధించిన ఫలితాలు విద్యతో పాటు విలువలు, నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత అభ్యాసానికి ప్రాధాన్యత తదితర అంశాలను తల్లిదండ్రులకు తెలియజేసి వారి చైతన్యవంతులను చేసేందుకు ఎడ్యుకేషన్ ఎక్స్పోలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ విద్యను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు విద్యాశాఖ కట్టుబడి పనిచేస్తోందని, ఈ దిశగా ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు.



















Owned by EDITOR and Publisher: PREM NATH THOKALA, 26/152, Buttaipet, Machilipatnam, Krishna Dist.,Printed at Sri Lakshmi Ofset Printer binders, D.no : 32-26-126/13, opp BSNL Bhavan, Chuttagunta, Vijayawada-4. ph:08672 227347.,cell 9848667347 - RNI NO: APTEL/2015/65279